


# శాశ్వతం

పి.వి.ఆర్. శివకుమార్

అంతవరకూ జోరుగా కురిసిన వాన హఠాత్తుగా వెలిసింది. మబ్బులు కరిగిపోవడంతో వాటి చాటున పడిపోయిన సూర్యుడు బయట పడ్డాడు. ప్రక్షాళితమైన ప్రకృతి సూర్య కాంతితో కొత్త అందాలు కొని తెచ్చుకుని మిలమిల మెరుస్తోంది. సంధ్యా సమయపు నీరెండ కావటాన అరుణవర్ణం ప్రకృతిని మరింత అందంగా మెరిపిస్తోంది.

కిటికీ దగ్గరగా స్టూలుమీద కూర్చుని ప్రకృతి అందాల్ని చూస్తోంది గాయత్రి. వాన నీటికి తడిసిన చెట్ల ఆకులు, పూలు నీరెండ పడి తళతళ లాడుతున్నాయి. అక్కడక్కడ నిలిచిన నీటి బిందువులమీద పడ్డ సూర్య కిరణాలు విశ్లేషణం చెంది వివిధ రంగుల్ని ప్రదర్శిస్తూ కిందికి జారిపోతున్నాయి.

సాయంత్రం కావటాన వార్డులన్నీ రోగుల తాలూకు బంధుమిత్రులతో సందడిగా వున్నాయి. ఆ సందడి గాయత్రికి చిరాకు. అందుకే ఆ సందడికి దూరం కావాలన్నట్టుగా తన స్టూలుని కిటికీకి దగ్గరగా వేసుకుని తోటలో లీనమైపోయింది.

''ఏమేవ్!'' సదాశివ కేకతో గాయత్రి ఏకాగ్రత భగ్నమైంది. తలతిప్పి, వెనక్కి, భర్తవైపు చూసింది ఎప్పుడొచ్చాడో, ఏమో ఆయన మంచం పక్కనే వున్న మరో స్టూలు మీద కూర్చుని వున్నాడు కాశ్యప. ఆమె లేచి నిలబడింది.

''ఏమిటా పరధ్యానం ? కాశ్యప పిలిస్తే వినపడలేదూ?'' గట్టిగా అన్నాడు సదాశివ.

''ఆవిడగారు ఏ అనంత లోకాల్లో విహరిస్తున్నారో ?'' వ్యంగ్యంగా నవ్వాడు కాశ్యప.

'తప్పురా, వదిన్ని అలా అనకూడదు' అన్నాడు సదాశివ.

''అంతే. దానికి ఏ బాధలూ, కష్టాలూ పట్టవ్. దాని లోకమే దానిది! మొగుడికి రోగమొచ్చి మంచమెక్కినా ఊహల విహారాలకి లోటుండదు'' ఈసడించాడు !

పెళ్ళయిన మొదట్లో అయితే యిటువంటి వ్యంగ్య భాషణాలకి కళ్ళవెంట గిరుక్కున నీళ్ళు తిరిగేవి గాయత్రికి.

'భర్త యింత కరుగ్గా ఎలా మాట్లాడగలడో' అనుకుంటూ బాధపడేది కాని రోజులు గడిచేకొద్దీ ఆ నిరాదరణ కూడా అలవాటయిపోయింది. అందుకే మారు మాట్లాడకుండా లేచి, కప్‌బోర్డులోంచి ఫ్లాస్క్ అందుకుని రెండు కప్పుల్ని కాఫీతో నింపి, ఇద్దరికీ అందించింది.

'నువ్వుకూడా తాగు' అని ఆ ఇద్దర్లో ఎవరూ అనలేదు.

'పడుచు పెళ్ళాన్ని గారాబంచేస్తే అలుసు తీసుకుని తన నెత్తిన స్వారి చేస్తుందేమో' నన్న భయం సదాశివది.

'ముసలి అన్నయ్యని నమ్ముకుని, తనని నిరాకరిస్తోంద'న్న కోపం కాశ్యపది.

పూర్వజన్మ పాపాలకి ప్రతిఫలం ఈ జన్మ అన్న నిర్వేదం గాయత్రిది.

''ఏమంటున్నాడన్నయ్యా, డాక్టర్ ?'' అడిగాడు కాశ్యప.

''ఏమంటాడురా ? రోజులు లెక్క పెట్టుకోమంటున్నాడు. ఈ వయసులో రెండోసారి అటాక్ రావటం ప్రమాదకరమే. ఇకనైనా జాగ్రత్తపడమంటున్నాడు.''

''ఈ వయసు, యీ వయసంటావ్, ఎన్నేళ్ళు వున్నాయన్నయ్యా నీకు ? యాభై

ధర్మపథం

# మానవతా దృష్టి

— బులుసు వెంకటరమణయ్య

ఇప్పటి వారిలో కొంతమంది ఆధ్యాత్మిక విషయాల్లో విశ్వాసం లేనివారు తాము మానవతా వాదులమనీ, పూర్వులు ఆధ్యాత్మిక దృష్టి కలవారనీ అనుకుంటారు. అంటే— తమది చాలా విశాలమైన దృష్టి కాని సంకుచితమైన దృష్టి కాదనీ, విశ్వమానవ సౌభాగ్యమే తమకు ప్రధానమనీ, చెప్పుకుంటారు. ప్రాచీనుల దృష్టి సంకుచితమనీ, స్వార్థంతో కూడినదనీ, వైదిక వాఙ్మయంలో కానవస్తున్న ప్రార్థనలు తమ శ్రేయస్సును తాముకోరుతున్నట్లు తెలుపుతున్నవనీ కొందరుతలుస్తున్నారు.

"అప్పటి రాజులు తమకు ఉన్న రాజ్యంతో తృప్తిపడక తమ అధికారం విస్తరించడం కోసం ఇతరదేశాలమీదికి యుద్ధానికి పోయేవారు. ఇది వారి స్వార్థ బుద్ధికి తార్కాణ వారికి సార్వభౌమతా దృష్టేగాని మానవతా దృష్టి లేనేలేదు" అని మనం సులభంగా అనుకోవచ్చు. రాజ్యకాంక్ష నాటికీ, నేటికీ సమానమే. పెద్ద పెద్ద రాజ్యాలు చిన్న రాజ్యాలను కబళించదలచడం అప్పుడే కాదు— ఇప్పుడూ కానవస్తున్నది. అప్పటి రాజులు అధికారం కోసమే ఎక్కువ పాకులాడే వారు: జన సామాన్యాన్ని హింసించడం వారికి అణుమాత్రమూ ఇష్టం కానేకాదు. అందువల్లనే వారు నగరాలకూ, గ్రామాలకూ దూరంగా యుద్ధరంగాన్ని నిర్మాయించుకొని, అక్కడనే తమ బలాబలాలు చూపుకునేవారు యుద్ధరంగానికి సమీపంలోనే గుడారాలు వేసుకని, యుద్ధం పూర్తి అయ్యే వరకూ అక్కడే నివసించేవారు. యుద్ధాలు పగటి పూట మాత్రం జరిగేవి. రాత్రి జరిగేవికావు రాత్రులు ఆలోచనలతోను, శత్రు రహస్యాలు కనుగొనే యత్నంతోనూ గడిచి పోయేవి ప్రజలకు ప్రాణభయంగాని, ఆస్తిపోతుందనే భయంకాని ఉండేవికావు.

నాగరికత అత్యున్నత స్థాయిని చేరుకొన్న యీ కాలంలో శాస్త్రవేత్తల దృష్టి క్రొత్త క్రొత్త మారణాయుధాలు కనిపెట్టి తయారు చెయ్యడం పైకే ప్రసరించినది శత్రు నగరములపై విమాన దాడులు జరిపి, ప్రజలకు ప్రాణనష్టం, ఆస్తినష్టం కలిగించడమే వారి ముఖ్యోద్దేశంలా కన్పిస్తుంది. ప్రజలను బాధిస్తే, వారు ప్రభుత్వాన్ని ఒత్తిడిచేసి, శత్రు పక్షంతో సంధి కుదుర్చుకునేటట్లు చెయ్యాలని వారి కోరిక దీనికై వందల వేలకోట్ల ధనం బుగ్గిపాలవడమే కానవస్తున్నది. పూర్వుల స్వార్థపరత్వాన్ని నిందించే యీ మానవతా వాదుల కృత్యాలు సమర్థించాలని ఎవ్వరూ అనలేరు నాగరికత, శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి అయిన కొలదీ అవి విశ్వశాంతికి మార్గదర్శాలు కావాలిగాని, సర్వనాశనానికి దారితీసేవిగా ఉండకూడదు. మానవతావాదానికి ప్రయోజనం విశ్వశాంతి! ఆస్తికులైనా— నాస్తికులైనా— ప్రజా సామాన్య హితమే తమకు ప్రధాన ధ్యేయమని గుర్తించవలసి ఉన్నది

---

దాటి అయిదేళ్లేగా! భరించి జాగ్రత్తగా వుంటే సరి .."

మనసులోనే కాశ్యప ధోరణికి ఛీత్కరించింది గాయత్రి

'ఎంత సంగనాచిలా మాట్లాడతాడు! ఈ దుర్మార్గపు నాటకతోనేకదూ 'వాడింక ఎన్నాళ్లో బతకడు. అన్నిరోగాల పుట్ట — యింకేం బతుకతాడు? నా మాట విని, నే చెప్పినట్లు చెయ్. మనిద్దరం + ఈ ఆస్తి కలిస్తే జీవితంలోకి స్వర్గాన్ని తెచ్చుకోవచ్చు' అని అన్నాడు! తను మొహాన ఉమ్మిందని కక్ష తీర్చుకో చూస్తున్నాడు! మళ్లీ ఆయనతో ఎంత తియ్యగా మాట్లాడుతున్నాడో! దుర్మార్గుడు...'

"అంతేరా, నీ ఓదార్పులే నాకు కొంత ఆసరా. మీ వదినకెలాగూ నేను అక్కర్లేదు. నా ఆరోగ్యమూ అక్కర్లేదు. ఎప్పుడెప్పుడు చస్తానా-ఆస్తి స్వంతం చేసుకు సుఖంగా బతుకుదామా అని చూస్తోంది-"

సదాశివ మాటలు వంటిమీద కిరోసిన్‌పోసి అగ్గి పెట్టినట్లనిపించాయి గాయత్రికి.

"ఎంత వంకరగా ఆలోచిస్తాడు భర్త! ఆయనే ఛస్తే నేనీ ఆస్తినను భవిస్తానా! ఏం,

## శాశ్వతం

ఆస్తిమీద వ్యామోహం వుంటే ఇప్పుడు మాత్రం తనకి అడ్డేముంది? లేవికుటుంబం నుంచి వచ్చినంతమాత్రాన కలిమి మీద తప్ప మరిదేనిమీద ఆశ వుండదా మనిషికి?

తాళి కట్టిన మొదటిరోజు నుంచీ భార్య మీద అనుమానం పెట్టుకు బతికే మనిషి అసలు పెళ్లెందుకు చేసుకున్నట్టు? అందుకే నేమో ఆ మొదటిభార్య ఆత్మహత్య చేసుకుంది! ఓపిక చచ్చిననాడే యింత పరుషంగా వుండేమనిషి, వయసులో వుండగా ఇంకెంత కాల్చుకు తినేవాడో ఆమెని!"

మరికాసేపు కూర్చుని ఆ మాటా, యీ మాట ఆడి వెళ్తున్నానని లేచాడు కాశ్యప.

"రేపు వస్తావుగా "అన్నాడు సదాశివ.

"ఆ-వస్తాను" గాయత్రి కేసి వంకరగా చూస్తూ జవాబిచ్చాడు అతను. గాయత్రి విసురుగా మొహం తిప్పుకుంది. అతడు వెళ్లిపోగానే ఆమెకి గాలి ఆడినట్లయింది. బాత్‌రూమ్‌కి వెళ్తానన్న భర్తని తీసుకు వెళ్లి, తీసుకువచ్చి, పడుకోబెట్టి, మళ్లీ తను కిటికీదగ్గర కూర్చుంది.

ఏడుగంటలు దాటుతుండటంతో వచ్చిన బంధుమిత్రులంతా తిరుగుముఖం పట్టారు. వాళ్ల కబుర్లు, నడకల్తో వరండా మళ్లీ చైతన్యం పుంజుకుంది.

పక్క బెడ్‌కేసి చూసింది గాయత్రి. పలకరింపుగా నవ్వాడు ప్రభు కళ్లలోనే జవాబిచ్చింది గాయత్రి.

చటుక్కున ఆమె కళ్లనిండా నీళ్లు నిండాయి.

"నేను చస్తే వాడితో లేచిపోదామని చూస్తున్నావా?" అన్నాడు సదాశివ నాలుగు రోజులనాడు గాయత్రితో! వాడంటే మరెవరో కాదు — పక్కబెడ్ పేషెంట్ ప్రభు... ప్రభాకర్!

ఆరోజు అతడికి విపరీతంగా గుండెనొప్పి వచ్చి, విలవిలలాడి పోతుంటే, తను వెళ్లి నర్సునీ, డాక్టర్నీ పిల్చుకు వచ్చింది. అది చూసే అంతమాటన్నాడు సదాశివ.

అనాథాశ్రమంలో పెరిగిన ప్రభాకర్‌కి బంధువులంటూ ఎవరూలేరు. అందుకే నెల్లాళ్ళుగా ఆస్పత్రిలో విశ్రాంతి తీసు

ఉంటున్న అతణ్ణి కలిసేందుకు ఆఫీసు మిత్రులు తప్ప బంధువులు రారు. అనాథగా పెరిగినా సరస్వతీ కటాక్షంవల్ల చదువు మాత్రం బాగానే అబ్బింది అతనికి. ఆ వూళ్ళోనే ఓ పెద్ద కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. తరచుగావస్తున్న గుండెనొప్పివల్ల — అతడిని ఆస్పత్రిలో చేర్పించింది కంపెనీ వాళ్ళే! ఆ నొప్పి ఏమిటో, ఎందుకొస్తోందో స్పెషలిస్టులక్కూడా అర్థం కాలేదు. అర్థంకాని వ్యాధుల్ని ముదరబెట్టడంలో స్పెషలిస్టులైన డాక్టర్లు అతనికి వయసుకి మించిన శ్రమవల్లనే గుండెనొప్పి వస్తోందనీ, మరో నెల రోజులపాటు డాక్టరుపర్యవేక్షణలో రెస్ట్ తీసుకుంటే, తగ్గిపోతుందనీ చెప్పారు. ప్రస్తుతం ఆ రెస్ట్‌లో వున్నాడతను

అతని కథవిన్న గాయత్రి మనసు చలించింది. అనాథగా పెరగటమే ఓ శాపమైతే, అనాథగా జబ్బుపడటం మరీ పెద్ద శాపం. నా అన్నవారు లేకుండా హాస్పిటల్ మంచానికి కాపలా కాయటం కష్టమైనపని. అందుకే, ఎప్పుడూ ఏదో ఒకటి చదువుతూ, లేదా కిటికీలోంచి కనబడే ఆకాశాన్ని, తోటనీ, చెట్లమీద పిట్టల్ని, ఆకాశంలోని మబ్బుల్ని చూస్తూ, గుండెనొప్పివస్తే బాధపడుతూ, అదికాస్త తగ్గితే సేద తీరుతూ పడివుండే అతను ఆమె మనసులో చోటు చేసుకున్నాడు.

అంతలోనే సదాశివ చటుక్కున అంతమాట అన్నాడు. నిర్ఘాంత పోయిన గాయత్రి, తేరుకున్నాక అసహ్యించుకొంటున్న చూపులతో ఒక్కసారి [illegible] ఊరుకుండి పోయింది. [illegible] అప్పట్నుంచి భర్త మెళుకువతో వుండగా అతనితో మాటలు మానేసింది. అటువైపు చూడటమూ మానేసింది. ఆ మౌనం ఆమె మనసులో అతడి రూపుని మరింత చిక్కగా దిద్దింది.

"ఆకలిగా వుంది. అన్నం పెట్టెయ్" అన్నాడు సదాశివ. గాయత్రి ఆలోచనల్లోంచి బయటపడి, కాశ్యప తెచ్చిన కారియర్ విప్పింది భర్తకి వడ్డించింది. అతడు తిన్న తర్వాత తనూ తినేసి తోటలో కారియర్ తొల్చుకు వచ్చేసింది.

క్రమంగా నిద్రకి పడ్డాడు సదాశివ. అతడికి పెందరాళే నిద్రపోవటం అలవాటు. ఆ మధ్యాహ్నం హాస్పటల్ పక్కనేవున్న అద్దె లైబ్రరీనుంచి తెచ్చుకున్న నవల చదవటం ప్రారంభించింది గాయత్రి.

సగందాకా చదివేసరికి విసుగుపుట్టింది. టైం చూసుకుంది. పదికావస్తోంది. పుస్తకం మూసి కప్ బోర్డ్ మీద పడవేసింది. లేచి నిలబడి వళ్ళు విరుచుకుంది. కిటికీ దాకా వెళ్ళింది. తోటలో వెన్నెల... గుండెల్ని బరువెక్కిస్తూ... వెనక్కి వచ్చేసిందామె— రెండు మంచాలకీ మధ్యగా. ఒక వైపు సదాశివ. మరోవైపు ప్రభు.

'ఏమీ అనుకోకపోతే ఒకమాట ... విలా చేసుకున్నారండీ ఆయన్ని ?'

అనడిగాడు నాలుగురోజుల క్రితమే — సదాశివ ఆ మాట అన్నాక, ఆ రాత్రి అతను నిద్రపోతుండగా ప్రభు.

అప్పుడూ కళ్లలో నీళ్ళు తిరిగాయామెకి.

'నేను చేసుకోలేదండీ, ఆయనే నన్ను చేసుకున్నారు— నా కుటుంబ బలహీనతని ఆర్థిక బలహీనతని—ఆసరాగా తీసుకుని !'అని చెప్పింది ఆ తర్వాత చాలాసేపటికి.

'నిజమే — ఏ వృద్ధ వివాహానికైనా కారణాలు అలాగే వుంటాయి. 'వివాహానికి కనీసం ఇన్నేళ్ళ వయసుండాలి' అని చట్టం చేసిన ప్రభుత్వం, ఇన్నేళ్ళు దాటేక పెళ్లి నిషేధం అంటూ ఓ అప్పర్ లిమిట్ కూడా ఎందుకు చట్టం చెయ్యదో! ఇలాటి వందలు, వేల పెళ్లిళ్ళు ... స్త్రీల పాలిట శాపాలు కావటం,అవుతుండటం ప్రభుత్వానికితెలీదా?' అనుకున్నాడు ప్రభు మనసులోనే.

రెండు మంచాలవైపూ మార్చి, మార్చి చూసింది గాయత్రి. ఇద్దరూ ప్రశాంతంగా నిద్రపోతున్నారు; ఆకలికీ, నిద్రకీ అందరూ సమానులే!

అక్కణ్ణుంచి కదిలి, కిందివున్న బొంతని చాపమీద పర్చుకొని, నిద్రకి పడింది తను కూడా!

* * *

ఉలిక్కిపడిలేచింది గాయత్రి. ఎందుకు మెళుకువొచ్చిందో క్షణకాలం అర్థం కాలేదు. గట్టిగా వినిపిస్తున్న మూలుగు చెవుల్లో పడగానే అర్థమయింది, అందుకే మెళుకువొచ్చిందని.

లేచినిలబడింది. సదాశివ మూలుగుతున్నాడు. గట్టిగా, మెలికలు తిరుగుతూ మూలుగుతున్నాడు. తడబడే అడుగులతో గబగబవెళ్ళి నైట్‌డ్యూటీ నర్సుని లేపింది. ఆమె విసుక్కుంటూ లేచి, పరిస్థితి గ్రహించి చటుక్కున డాక్టర్‌కి ఫోన్ చేసింది. అయిదు నిమిషాల్లో డాక్టర్ రావటం, ఓ ఇంజక్షన్ యివ్వటం, అతణ్ణి ఎమర్జెన్సీ వార్డులోకి పంపటం జరిగిపోయాయి. అదే గదిముందు కూర్చున్న గాయత్రిని చూసి, "మీరు ఇక్కడెందుకమ్మా? వార్డులోనే వుండండి. ఏదైనా అవసరమొస్తే పిలుస్తాములే" అంది నర్సు. నిర్లిప్తంగా లేచి వార్డువైపు అడుగువేసింది గాయత్రి. ఖాళీబెడ్ ఆమెని వెక్కిరిస్తూ కనబడింది. గాయత్రికి ఏడుపు రాలేదు. కళ్ళు పొడిగా మండుతున్నాయి

మండుతున్న కళ్లని మూతలు వేసుకు అక్కడే కూలబడింది గాయత్రి.

* * *

అగ్నిశిఖలు ఆరడుగుల ఎత్తున లేస్తూ



భయంకరంగా నాలుకలు చాస్తున్నాయి. మొట్టమొదట చిన్న చితుకుల మంటగా కనిపించినదే రానురాను పెద్దదైపోయింది.

ఓ చెట్టుమీద కూర్చుని వున్నారు గాయత్రి, సదాశివ.

"వద్దండీ, నాకుభయంగా వుందండీ..." అంటోంది గాయత్రి.

"నోర్మయ్ జరుగు ముందుకు..." అంటున్నాడు సదాశివ.

గాయత్రి నడుముకి ఓ తాడు బిగించి వుంది క్రింద నిలబడ్డ కాశ్యప చేతిలో ఆతాడు రెండో కొసవుంది. దాన్నిపట్టి లాగుతున్నాడు అతను. అతనిపక్కనే అంతెత్తు మంటలు.

కళ్ళు మూసుకుని, దేవుణ్ణి తల్చుకుని దూకేసింది గాయత్రి — ఆ మంటల్లోకే!

విచిత్రం. ఒళ్ళు కాలలేదు. అసలేమీ కాలేదు

కళ్ళు తెరచి చూసేసరికి ఆమె ఎవరి ఒళ్ళోనో పడుకొని వుంది. ఆమెకళ్ళు ఆమొహాన్ని గుర్తుపట్టాయి — అది ... అది ప్రభు.

తను .. ప్రభువళ్ళో పడిందా! మంట లేవీ? అతను ఆర్పాడా!? వాటి స్థానే తను నిలబడ్డాడా?

మరి ... భర్త? చెట్టుమీదకు చూసింది.

సదాశివ ఏదో అడవి పిల్లిలా మారిపోయి పారిపోతున్నాడు దూరంగా ... ఓ చెట్టు మీంచి మరోచెట్టుమీదికి దూకుతూ!

* * *

ఎవరో కుదిపినట్టు కళ్ళు తెరిచింది గాయత్రి ఎవరూ లేరు. కల గుర్తుకు వచ్చింది!

'ఎంత భయంకరమైన కల! ఎందుకు వచ్చింది అలాటికల! ఓ వైపు భర్త చావు బతుకుల్లో వుంటే తనకళ్ళు మూతలెలా పడ్డాయి? పడినా కలలు గనేటంత నిద్ర ఎలా పట్టింది? పట్టినా, యిలాటి కలా? భర్త ప్రమాదంలో వుండగా తనకి అతడు పారిపోతున్నట్టు కలొచ్చిందంటే అర్థం? తన పసుపు కుంకుమలు 'శాశ్వతం' కాదా?

ఎంత విషాదం! తనకి ఏడుపు రావటం లేదేం?...!'

ఆలోచనల్లోంచి బయటికి వచ్చింది నర్సు అడుగుల చప్పుడుతో గాయత్రి దూరంగా కనపడింది తమ వార్డువైపే వస్తున్న నర్సు.

## శాశ్వతం

'ఏ వార్త మోసుకువస్తోంది? ఐయామ్ సారీ.. అనబోతోంది. అంతేగా!'

గాయత్రి గుండెలు గుబగుబలాడాయి. క్షణంపాటు పెదవులు వణికాయి. బిగబట్టి లేచి నిలబడింది గాయత్రి

నర్సు సూటిగా నడిచి గాయత్రిని సమీపించింది.

"ఇంకేంఫర్వాలేదు. మీ ఆయన నిద్రపోయేందుకు మందిచ్చారు రేపు ఉదయం డాక్టర్‌గారు మళ్ళీవచ్చి చూశాక, వార్డులోకి పంపిస్తారు" చెప్పింది ఆమెతో.

గాయత్రి నిట్టూర్చి, మళ్ళీ అక్కడే కూలబడింది.

మనసుకి టెన్షన్ తగ్గింది. కొంత రిలీఫ్‌గా అనిపించింది కానీ, ఎందుచేతో 'భర్త ప్రమాదం నుంచి బయటపడితే భార్యకు కలగవల్సినంత రిలీఫ్ తనకి కలగలేదేమో' అనిపించిందామెకి.

మళ్ళీ కళ్ళుమూసుకుంది. మళ్ళీ ఆలోచన్లు ముసురుకున్నాయి.

'రాత్రల్లా నేను ఎమర్జెన్సీవార్డులో చావు బతుకులమధ్య పడివుంటే, నువ్వు 'వీడి' మొహం తిలకిస్తూ యిక్కడే హాయిగా కూర్చున్నావా?' అంటూ భీకరంగా సదాశివ తనని అడుగుతాడా రేపు?

ఆ ఆలోచన రాగానే భయంతో వణికింది గాయత్రి 'లేచివెళ్ళి ఆ వార్డుముందే కూలబడితే?'

'ఎందుకు అంత భయం? అయినా, తను ఇక్కడ కూర్చున్నట్టు ఆయనకి ఎవరు చెపుతారు?'

'ఎవరేనా చెప్పొచ్చు. కాశ్యప రేపొచ్చి, రాత్రల్లా ఆయన ఎమర్జెన్సీవార్డులో వున్నారని తెలియగానే లాపాయింటు తీసినట్టు తను రాత్రల్లా ఎక్కడుందీ? అన్న విషయం ఆరా తీయడూ?'

'పోనీయ్. మరీ అంతటి దుర్మార్గం ఎదురౌతుంటే, తను ఎంతకని ఎదుర్కోగలదు? ఎంతకని వాళ్ళని సంతృప్తిపరచగలదు?'

భయంస్థానే ఓ విధమైన మొండితనం చోటు చేసుకుంది గాయత్రి మనసులో.

కళ్ళుతెరుమకు అలాగే కూర్చుంటే ఎదురుగా నిద్రపోతున్న ప్రభు కన్పిస్తున్నాడు.

'నేను చస్తే వాడితో లేచిపోదామని చూస్తున్నావా?' నవ్వుకుంది పేలవంగా. 'అంత అదృష్టమా నాకు?'

వెంటనే ఎవరో వెన్నుతరిచి అడిగినట్లా అనిపించింది

'అంటే...అదృష్టం కల్సివస్తే నీకూ లేచిపోవాలనే వుందా?'

'ఏం? మొదటి భార్య చచ్చిపోగానే ముసలిమొగుడు రెండోపెళ్ళి చేసుకోవచ్చు. మరి ముసలిమొగుడు పోతే, పడుచు భార్య రెండోపెళ్ళి చేసుకోకూడదా?'

'అంటే .. నువ్వు ముసలిమొగుడు చచ్చిపోవాలనికూడా కోరుకుంటున్నావా?'

"ఛీఛీ" విసుక్కుంటూ లేచి నిలబడింది గాయత్రి.

ఇహలాభంలేదనుకుంటూ బ్రష్‌మీదపేస్టు వేసుకుని బాత్‌రూమ్ వైపు నడిచింది. మొహం కడుక్కువచ్చి, రాత్రి వదిలేసిన నవల చదువుతూ, ఆలోచనల్నుంచి మనసు మళ్ళించుకునే ప్రయత్నం చేయసాగింది, ఎమర్జెన్సీవార్డుముందు కూర్చుని.

* * *

తెల్లగా తెల్లవారింది. వార్డులో సందడి మొదలయింది. ఆయాలు అటూ యిటూ హడావిడిగా తిరుగుతున్నారు. పేషెంట్లు ముఖాలు కడుక్కుని, బంధువులో, మిత్రులో తెచ్చిన కాఫీలు సేవిస్తున్నారు.

రోజూ ఆ సరికి ప్రభుదగ్గరకు వచ్చి, అతడిదగ్గర డబ్బులు తీసుకుని కాఫీ తెచ్చి పెట్టే అటెండరు వచ్చాడు. కానీ, ప్రభు ఇంకా నిద్రపోతూ వుండటంతో, అతణ్ణి లేపబోయాడు.

ప్రభు దేహం చల్లగా...మంచులా...

గబగబా పరుగెత్తి నర్సుని పిల్చుకొచ్చాడతను.

డాక్టర్ వచ్చాడు. అధికారికంగా ప్రభు మొహంమీదికి దుప్పటి పడిపోయింది!

అదేసమయానికి, ఎమర్జెన్సీ వార్డులోంచి, స్ట్రెచర్‌మీదుగా బయటకు వచ్చిన సదాశివ వెనుకే నడుస్తూ తమ వార్డులోకి వచ్చిన గాయత్రి కళ్ళల్లో మెరుస్తున్న ఆనందానికి నల్లటి మబ్బుతెర పడగా, నిశ్చేష్టురాలై స్థాణువులా నిలబడిపోయింది గుండెనొప్పినుంచి శాశ్వతంగా విముక్తి పొందిన ప్రభుని చూస్తూ!